# చేతులు

చేతులు నడుస్తున్నాయి.

కోటు జేబుల్లో కాస్సేపూ, పాంటు జేబుల్లో మరి కాస్సేపూ చేతులు నడుస్తున్నాయి

కుడిచెయ్యి కోటు జేబులో దూరి చేతి రుమాలు - సెంటు పూసిన సిల్కు రుమాలు బయటికి తీసింది. మొహం తుడిచింది. ఎడం చెయ్యి జుట్టు సవరించింది. కళ్ళజోడు సరిదిద్దింది.

కుడిచెయ్యి మణికట్టు కళ్ళ ముందుకొచ్చింది. ఎండలో స్మగుల్డ్ వాచ్ ధగధగ ! ఇటీజ్ ఫైవ్ పాస్ట్ టెన్. త్వరగా వెళ్ళాలి.

రెండు చేతులూ వూగుతూ నడుస్తున్నాయి. "బాబూ ! ఒక పైసా బాబూ ! రెండు చేతులూ లేవు బాబూ. అవిటోణ్ణి బాబూ !" పేవ్‌మెంట్ మీద చతికిలబడి కూర్చుని అరుపులు; మెడలో వేళ్ళాడుతూ అంచులకి తీగె కుట్టిన పాత డబ్బా భుజానికి వేళ్ళాడుతూ ...ండిచేతులు... మోచేతుల వరకూ చేతుల్లేవు. "బాబూ ! ఒక పైసా బాబూ ! చేతుల్లేని ...టోణ్ణి బాబూ !"

"లేదుపోరా !" ఊగుతూ నడుస్తున్న రెండు చేతుల్లో కుడిచెయ్యి లేదు పొమ్మన్నట్టు ఊగి, కోటు జేబులో దూరి దాక్కుంది. బయటికి రాలేదు. ముందుకు సాగిపోయింది

"హలో మిస్టర్ రావ్ ! హౌ ఆర్ యూ !" కోటు జేబులో దాక్కున్న చెయ్యి బయటికొచ్చి ఎదురొచ్చిన చేత్తో కలిసింది. ఒకవూపు వూగి విడిపోయింది.

రెండు చేతులూ వూగుతూ మళ్ళీ ముందుకు నడిచాయి. "వాడి చెయ్యి వుందేమిటి ? చచ్చినవాడి చెయ్యిలా చల్లగా !"

"రిక్షా కావాలా బాబూ ?" పక్కకొచ్చి ఆగింది రిక్షా. హాండిల్ మీద నల్లటి చేతులు, మొరటుగా, మొద్దుగా చెమటలు కక్కుతున్న చేతులు. చేతులకి చొక్కా లేదు.

రిక్షా కావాలా బాబూ !

వద్దు పోరా !

హాండిల్ మీద చేతులు వెనక్కి తిరిగి వెళ్ళిపోయాయి. "ఐ హేట్ దీజ్ ఫెలోస్!" అయినా నేను రిక్షా ఎక్కడమేమిటి ?"

మళ్ళీ ఊగుతూ, నడుస్తూ, చేతులు.

'టాక్సీ ! ఏయ్ టాక్సీ !'

టాక్సీ ఆగింది. స్టీరింగ్ మీద ఖాకీచొక్కాలో నల్లటి పుల్లల్లాంటి చేతులు.

'ఎక్కడికి పోవాలి సార్ ?'

కుడిచెయ్యి డోర్ తెరచింది. రెండు చేతులూ లోపలికి దూరి దర్జాగా కూర్చున్నాయి. ఎడం చెయ్యి డోర్ మూసింది.

కారు ముందుకి నడిచింది. వేగం పుంజుకుంది. దడదడ దడదడ... ఏదో శబ్దం.

'డోర్ సరిగా పడలేదు సార్ !'

కారు వేగం తగ్గింది. స్టీరింగ్ మీద నుండి నల్లటి, పుల్లలాంటి చెయ్యి వెనక్కొచ్చి డోరు గట్టిగా లాగి కొట్టింది. కారు మళ్ళీ స్పీడందుకుంది.

"నాకు డోర్ వెయ్యటం రాదనుకున్నాడు కాబోలు వెధవ కారూ వీడూనూ. దీని తాతలాంటి కారు కొంటాను . కొనాలి ఇక లాభం లేదు."

చెయ్యి జేబులో దూరి, సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె తీసింది. రెండు చేతులూ కలిసి వెలిగించాయి దర్జాగా. సీటు మీదికి, వెనక్కి రెండు వేపులా రెండు బారజాపుక్కూచున్నాయి.

స్టీరింగ్ మీద నల్లచేతుల్లో ఒకటి ఖాకీ చొక్కా జేబులోకి దూరి బీడీ తీసింది. అగ్గిపెట్టె తీసింది. వెలిగించింది. రాగి జట్టులోకి దూరింది. అద్దం ముందుకి కొద్దిగా వంగిన తలలో జట్టు సవరించింది.

'ఓరి వీడి స్టయిల్ తగలడా ! ఒక్క చేత్తో ఎంత షోగ్గా డ్రైవ్ చేస్తున్నాడు..'

'లెఫ్ట్ ! లెఫ్ట్ ! రైట్ రైట్, రైట్ !'

ఎండు కట్టెలాంటి నల్లటి చెయ్యి ఒక్కటే స్టీరింగ్ మీద సుతారంగా వేగంగా చురుగ్గా

కదులుతోంది. కారు టాప్‌స్పీడ్‌లో పరుగెడుతోంది.

'ఇలాంటి కేర్‌లెస్ వెధవల్తో ప్రమాదం, ఆ చెయ్యి చూడు ఎలా వుందో పుల్లలా... ఇలా తిరుగుతూ తిరుగుతూ ఎప్పుడో పుటుక్కున విరిగి ఊరుకుంటుంది. అసలిలాంటి చేతులేమిటి స్టీరింగ్ మీద ? కారు నడిపే చేతులెంత దర్జాగా వుండాలి. ఆ ఁ.. ఆఁ.. స్టాప్ హియర్. ఇక్కడాపవోయ్ !'

సడెన్ బ్రేక్, కారు కీచుమంటూ ఆగింది.

కోటు చేతులు కారులోంచి కిందికి దిగాయి.

నల్లటి పుల్లలాంటి చెయ్యి కారులోంచి బయటికొచ్చింది. అరచెయ్యి కూడా నలుపే. కోటు చెయ్యి కోటు జేబులోంచి డబ్బు తీసి ఇచ్చింది. స్టీరింగ్ మీది చెయ్యి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

కోటు చేతులు గేటు లోపలికి నడిచాయి. మెట్లెక్కాయి. కోటు చేతులు చూడగానే హాల్లో కూర్చున్న చేతులన్నీ లేచి నిలబడ్డాయి. మగచేతులు, ఆడచేతులు, పొడుగు చొక్కాల చేతులు, బుష్ షర్టుల చేతులు, బిగువు జాకెట్ల చేతులు, గుమాస్తా చేతులు... అన్నీ పైకి లేచాయ్.

గుడ్‌మార్నింగ్ సార్ !

నమస్కారం సార్ !

గుడ్‌మార్నింగ్ సార్ !

కోటు చేతులు చలించకుండా కోటు జేబుల్లో దూరి స్టయిల్‌గా, ఠీవిగా, టకటకా నడుచుకుంటూ ముందుకి సాగిపోయాయి.

ముసలి చెయ్యొకటి, ముడతలు పడ్డ చెయ్యొకటి రూమ్ ముందు నిలబడి సలాం కొట్టింది. రెండో ముసలి చెయ్యి స్ప్రింగ్ డోర్ లాగి పట్టుకుంది.

కోటు చేతులు దర్జాగా లోపలికి నడిచి కుషన్ చెయిర్లో రిలాక్సయి కూర్చున్నాయి. కుడి చెయ్యి కోటు జేబులోంచి చేతి రుమాలు - సెంటు పూసిన సిల్కు రుమాలు తీసి మొహం తుడిచింది.

ముసలి చెయ్యి గబాగబా వచ్చి, ఫాన్ ఆన్ చేసింది.

'మంచి నీళ్ళు పట్రా !'

'సిత్తం బాబూ !'

ముసలి చేతులు మంచి నీళ్ళు తెచ్చాయి.

'ఒరేయ్ రాస్కెల్ ! గ్లాసులో వేళ్ళు మునగనివ్వద్దని ఎన్నిసార్లు చెప్పాన్రా నీకు ? వెధవ చేతులు నువ్వూను నీ వేళ్ళన్నీ అందులో ముంచి...'

'పొరపాటైపోయింది బాబూ.. మన్నించండి... మళ్ళీ తెత్తాను... ' గ్లాసు పట్టుకున్న ముసలి చేతులు, ముడతలు పడ్డ చేతులు వణికాయి.

'స్టెనోని ఒకసారి రమ్మను.'

'సిత్తం బాబూ !'

స్వింగ్ డోర్ తెరుచుకుని స్లీవ్‌లెస్ చేతులు వయ్యారంగా లోపలికి వచ్చాయి.

'గుడ్‌మార్నింగ్ సార్ !'

' టైప్ దిస్ లెటర్ !'

'యస్ సార్ !'

స్లీవ్‌లెస్ చేతులు... గుండ్రంగా ... నున్నగా... పచ్చగా వున్న చేతులు.. ముందుకొచ్చాయి.

కోటు చెయ్యి లెటరు అందించింది.

స్లీవ్‌లెస్ చేతులు పక్క టేబుల్ ముందు కూర్చుని, టైప్ మిషన్ ముందుకు లాక్కున్నాయి.

టక్‌టక్...టక్‌టక్ టక్ ట... టక్‌టక్.. టక్‌టక్ టక్...టక్.టక్..టక్..

పచ్చగా, పొడుగ్గా, సన్నగా. చేపలంగా వున్న వేళ్ళు అందంగా, సుతారంగా , వేగంగ కదులుతున్నాయి.

లంజ వేళ్ళు బావున్నాయి సెక్సీగా ! 'మిస్ రాణీ ! టేక్ దిస్ పేపర్ ఆల్సో...'

ఓ కే సార్ !

స్లీవ్‌లెస్ చేతుల అందం చూసి, కోటు చేతులకి పిచ్చెక్కింది. ఆ చేతుల్ని పట్టుకుని నిమిరి... నొక్కి.. పిసికి.. కోరికతో కోటు చేతుల వేళ్ళు కొంకర్లు పోయాయి.

'మిస్ రాణీ ! ఐ లైక్ యూ వెరీమచ్ ! ఐ వాంట్ టూ ఎన్‌హాన్స్ యువర్ ఫీ, ఫ్రమ్ నెక్స్ట్ మంత్ !

'థాంక్యూ సర్ ! థాంక్యూ వెరీమచ్ !'

ఇంకెక్కడికి పోతాయ్ దీని చేతులు నాకు దొరక్క !

చేతులే ఇంత బావుంటే...

ముసలి చేతులు ఒక విజిటింగ్ కార్డు తెచ్చి టేబిల్ మీద పెట్టాయి. కోటు చెయ్యి దాన్ని పరీక్షించి , లోపలికి తీసుకురమ్మన్నట్టుగా సైగ చేసింది.

సిల్కు లాల్చీ చేతులు - ఒక చేత్తో స్టేట్ ఎక్స్‌ప్రెస్ పాకెట్టూ, ఒక చేత్తో సిగరెట్టూ పుచ్చుకుని దర్జాగా లోపలికొచ్చాయి.

'హల్లో మిస్టర్ రావ్ !'

'అయ్యా అయ్యా నమస్కారం ! దయ చెయ్యండి ! దయ చెయ్యండి ... కూర్చోండి.'

లాల్చీ చేతులు రెండూ దర్జాగా ముందుకొంగి, టేబిల్ మీద ఆనుకుని కూర్చున్నాయి. పాకెట్ లోంచి సిగరెట్ కొద్దిగా బయటికి లాగి ముందుకు చాచాయి.

'అబ్బే వద్దండీ ...'

'ఫర్వాలేదు , తీసుకోండి...'

కోటు చేతులు సిగరెట్ తీసుకున్నాయి. లాల్చీ చెయ్యి, జేబులోంచి బంగారపు పూత పూసిన లైటరు తీసి సిగరెట్టు వెలిగించింది.

లాల్చీ చేతులూ, కోటు చేతులూ చాలాసేపు మాట్లాడుకున్నాయి. తర్వాత అవీ ఇవీ కూడా టేబిల్ కిందికి దూరాయి. లాల్చీ చేతుల్లోంచి కోటు చేతుల్లోకి నోట్ల కట్ట మారింది.

వెళ్ళే ముందు లాల్చీ చెయ్యి కోటు చేతిని పట్టుకుని వూపింది. శెలవు దీసుకు వెళ్ళిపోయింది.

అబ్బ ! ఎంత మెత్తగా వుంది వీడి చెయ్యి. ఆడదాని చేతిలా ! అవున్లే వాడికేమిటి మిలియనీరు. నోట్లు లెక్కపెట్టడం తప్ప వాడికి పనేముంది..?

'మే ఐ కమిన్ సర్ ?'

'వూ..'

బక్కగా , తెల్లగా పాలిపోయి, లూజ్‌గా, మాసిపోయి వున్న చొక్కాలో వేళ్ళాడుతూ రెండు చేతులు లోపలికొచ్చాయి. నమస్కారం చేశాయి.

'ఏమోయ్ ! ఏం కావాలి ?'

పాలిపోయిన బక్క చేతులు కాస్సేపు చేతులు కట్టుకు నిలబడ్డాయి. ఏదేదో గొణిగాయి. వణుకుతున్నాయి. కాస్త ముందు కొచ్చి టేబిల్ మీద ఆనుకున్నాయి. పెళ్ళాం కానుపు గురించీ, పిల్లల రోగాల గురించీ, ఇంక్రిమెంట్ల గురించీ జడుస్తూ జడుస్తూ మాట్లాడుతున్నాయి.

కోటు చేతులకి చిరాగ్గా వుంది. టేబిల్ మీద తెల్లగా, బక్కగా, పాలిపోయి నరాలు పైకి తేలి, ఎండిపోయిన చేతులు అసహ్యంగా, భయభయంగా కదులుతున్నాయి. నా ముందు టేబిల్ మీద చేతులానించి నిలబడతాడూ, వెధవ చేతులు.. ఏడుపు గొట్టు చేతులు.. ఎంత పొగరు ...?

'రిమూవ్ ది హాండ్స్ ఫస్ట్, కాంట్ యూ స్టాండ్ ఎరక్ట్ ?

'సారీ సర్ !' సారీ - టేబిల్ మీద వాలిన బక్క చేతులు భయంభయంగా వెనక్కు వెళ్ళిపోయాయి.

'ఎప్పుడూ డబ్బు కోసం ఏడుపే. ఇప్పుడేం లాభం లేదు.. వెళ్ళిపో.. వెళ్ళు. వెళ్ళు !

బక్క చేతులు నీరసంగా , దిగులుగా , లూజు చొక్కాలో వేళ్ళాడుతూ రూమ్‌లోంచి బయటికి వెళ్ళిపోయాయి. ●

*(ఉదయ సాహితి- జన్మదిన ప్రత్యేక సంచిక - ఆగష్టు, 1971)*